# ఓటరు నమోదుకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, డిసెంబర్ 15 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఓటర్ నమోదు పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలింగ్ బూత్ వారీగా విస్తృతస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. 1300 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించాలని తెలిపారు. వలస పోయిన, మరణించిన ఓటర్లు గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ గుర్తింపు కార్డులో చిరునామా లో మార్పులు చేర్పులు ఉంటే సరి చేసుకోవాలని ఆయన సూచించారు. ఓటర్లు తమ ఓటును వేరే ప్రాంతాలకు మార్చుకునే అవకాశం ఉన్నందున వాటిపై కూడా ప్రజల్లో అవగాహన తీసుకురావాలని ఆయన వివిధ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**కొడంగల్:** రానున్న పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల కమిషన్ ఓటరు నమోదు ప్రక్రియకు అవకాశాన్ని కల్పించిందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీ ల నాయ కులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరు నమోదు చేసు కునే విధం గా పార్టీల నాయకులు అవగాహన కల్పించాలని కోరారు. అదేవిధంగా మార్పు లు చేర్పు లు ఉన్నవాటని సరి చేసుకునే విధంగా సహకరించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల మార్పు అవసరం ఉంటే తగు సూచనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ డిప్యూటీ తహసీల్దార్‌లు సురేశ్‌కుమార్, శివకుమార్‌లతో పాటు పార్టీల నాయకులు రమేష్‌బాబు, కృష్ణంరాజు, ఎస్‌బీ గుల్షన్ పాల్గొన్నారు.



కొడంగల్: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

# ప్రజల మధ్యనే ఉంటా..

## మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, డిసెంబర్ 15: ఓడినా.. గెలిచినా.. ప్రజల మధ్యనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలో పలు వివాహవేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపు ఓటములను సహజమని, ప్రజా తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఓడిపో యినప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి ఉంటుందని భరోసా కల్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

# ఇస్తేమా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 15 : పరిగి మండల పరిధిలోని న్యామత్‌నగర్ దగ్గర నిర్వహించే ఇస్తేమా ఏర్పాట్లను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. రెండు రాష్ర్టాల నుంచి ఇస్తేమాకు పెద్ద ఎత్తున మైనార్టీ సోదరులు హాజరవుతుండటంతో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇస్తేమా నిర్వహణకు ఇదివరకే 2.45 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసినట్లు గుర్తు చేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అనురాధాబాల్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మారఘుగౌడ్

కులకచర్ల, డిసెంబర్ 15: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అనురాధా బాల్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మరఘుగౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన మోని చంద్రయ్య, ఫీల్డ్‌అసిస్టెంట్ నర్సింహులు, స్కూల్ కమిటీ చైర్మన్ నర్సింహులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రామయ్య, గౌడ సంఘం జంగం మల్లయ్య, బాలకృష్ణయ్య, చిన్నయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, చంద్రయ్య, మల్లయ్య, మొగులయ్య, పోచయ్య, శంకర్, నర్సింహులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

పూడూరు, డిసెంబర్ 15 : చట్టాల పై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార సంఘం సభ్యులు నర్సింగ్ రావు, గౌస్‌పాషలు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సోమన్ గుర్తి గ్రామంలో పరిగి కోర్టు న్యాయవాదులు సర్పంచ్ సంధ్యాభాస్కర్‌రెడ్డిల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉంటే నేరుగా పోలీసులను గానీ, న్యాయవాదులతో గానీ చర్చించి సమస్యలను పరిష్కరించు కోవచ్చన్నారు. చట్టాలపై అవగాహన లేక చిన్న పాటి కేసులతో పేదలు ఆర్థికంగా ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. ఎక్కడైనా సరైన న్యాయం జరుగకపోతే నేరుగా కోర్టు ద్వారా న్యాయం పొందవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వేణుగోపాల్, నసీర్, కోర్టు సిబ్బంది, గ్రామస్తులు వివేకానందరావు, సత్యనారాయణ, వెంకటయ్య, సాయన్న, ఆశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా నాగరాజు యాదవ్



నాగరాజ్ యాదవ్‌ను సన్మానిస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్లు, పీఏసీఎస్ సిబ్బంది

కులకచర్ల, డిసెంబర్ 15 : కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా వైస్ చైర్మన్ నాగరాజు యాదవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా ఉన్న బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఆయన పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న నాగరాజుకు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 13 మంది సభ్యుల్లో 12మంది హాజరు కాగా సభ్యుల అంగీకారం మేరకు నాగరాజు యాదవ్‌కు బాధ్యతలు అప్పగించారు. కాగా పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్న బుయ్యని మనోహర్‌రెడ్డి తిర్మలాపూర్ పరిధిలోని డైరెక్టర్‌గా ఉండేవారు ఆయన రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో మరొక డైరెక్టర్‌ను ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో బక్కారెడ్డి, డైరెక్టర్లు నర్సింహులు, రత్నమ్మ, సీహెచ్ కృష్ణయ్య, హేమ్లు, ఆశన్న, భీమయ్య, విజయ్‌కుమార్, పెద్ద అంజిలయ్య, కొండయ్య గౌడ్, సత్యమ్మ, సారా నర్సింహులు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా పీఏసీఎస్ అభివృద్ధికి కృషిచేస్తానని నూతనంగా పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగరాజ్ యాదవ్ తెలిపారు

# ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును పరిశీలించిన ఎస్ఈ



కొడంగల్, డిసెంబర్ 15: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని శుక్రవారం ఎస్ఈ వసంత్‌నాయక్ పరిశీలించారు. క్యాంపు కార్యాలయ పరిస్థితులను గమనించడంతో పాటు తీసుకోవాల్సిన మరమ్మతులు, పెయింటింగ్, విద్యుత్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. డీఈ సురేందర్‌కు క్యాంపు కార్యాలయంలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైవేరోడ్డు పనుల పరిశీలనలో భాగంగా క్యాంపు కార్యాలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కులకచర్ల, డిసెంబర్ 15 : నేటి బాలలే రేపటి పౌరులని అంతారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంతారం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాను సవరించాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

కులకచర్ల, డిసెంబర్ 15 : మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను సవరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గాదో మహిపాల్ ముదిరాజ్ అన్నారు. శుక్ర వారం కులకచర్ల డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. మండల కేంద్రంలో ఎనిమిది పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను సవరించాలని తెలిపారు. ఒక పోలింగ్ బూత్‌కు చెందిన ఓటరును మరొక పోలింగ్ బూత్‌లో నమోదు చేశారని ఇలా చేయడం వలన ఓటు వేయడానికి ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏ వార్డు వారికి ఆ వార్డులో, ఆ పోలింగ్ కేం ద్రంలోనే ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చూడాలని తెలిపారు. అదే విధంగా ఒక వ్యక్తి పేరు రెండు మూడు పోలింగ్‌బూత్‌లలో నమోదు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మోర్చా మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్, సీనియర్ నాయకులు నీరటి కర్ణయ్య, వార్డు సభ్యులు కాటన్‌పల్లి మైపాల్, మండల ట్రెజరర్ కొండ ఆంజనేయులు, బూత్ కమిటీ అధ్యక్షుడు పీరంపల్లి మల్లేశ్, జోగు రాంచంద్రయ్య, బూరకొండ సత్యం పాల్గొన్నారు.

# 18న మండల సమావేశం

ధారూరు, డిసెంబర్ 15: ఈ నెల 18న సోమవారం ఉదయం 11:00 లకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీవో షఫీవుల్లా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. వివిధ గ్రామాల సర్పం చ్‌లు, ఎంపీటీసీలు గ్రామ, మండల స్థాయి అధికారులు, హాజరు కావాలని తెలిపారు.

# ఎఫ్ఎల్ఎన్ ద్వారా విద్యాబోధన చేయాలి

కులకచర్ల, డిసెంబర్ 15 : పాఠశాలల్లో విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ ద్వారా విద్యాబోధన చేయాలని కులకచర్ల ఎంఈవో అబీబ్‌హైమద్ అన్నారు. శుక్ర వారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తొలిమెట్టుకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని అన్నారు. తొలిమెట్టు ద్వారా విద్యార్థులకు వివిధ పద్ధతులను ఉపయోగించి విద్యను అందించాలని తెలిపారు. పాఠశాలలో బోధిస్తున్న ఎఫ్ఎల్ఎన్ పద్ధతులను యాప్‌లో నమోదు చేశారు. దీంతో పాటు ఉపాధ్యాయులు పాఠశాలకు సక్రమంగా సమయానికి హాజరుకావాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.